క్లుప్తంగా

షబ్బీర్‌అలీకి సన్మానం



షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్‌అలీని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో జహీరాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్‌షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉమ్మడి జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యులు రషీద్, నాయకులు తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌తో రైతుకు గాయాలు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎర్థనూర్ గుట్టల్లో క్రషర్ నిర్వాహకులు నిర్వహించిన బ్లాస్టింగ్‌తో రైతు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. తహసీల్దార్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్థనూర్ తండాకు చెందిన రమావత్ భీముడు పొలంలో రోజు మాదిరిగా ఎప్పటిలాగే పనిచేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గుట్టల్లో ఉన్న క్రషర్ నిర్వాహకులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండానే బ్లాస్టింగ్ నిర్వహించడంతో బలమైన రాయి వేగంగా వచ్చి భీముడిపై పడింది. దీంతో భీముడు చేతికి తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.

సీఐటీయూలో చేరిక

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పలువురు భవన నిర్మాణ కార్మికులు శనివారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు అసంఘటిత కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, పెన్షన్, ప్రమాదబీమా, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు భిక్షపతి, నరేష్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం



శిక్షణ పూర్తిచేసుకున్న మహిళకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఏటీఓ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో గ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలోయువత, మహిళలకు ఉచితంగా కంప్యూటర్, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు ఏడు బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా ఇటీవల 8వ బ్యాచ్ పూర్తి చేసుకున్నవారికి శనివారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏటీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందినవారు ఇంతటితో ఆగిపోకుండా మరింతగా నేర్చుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామిక్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు రాంచందర్, డాక్టర్ శివబాబు, సభ్యులు వెంకటేశం, శ్రీనివాస్, శ్వేత, నర్సింహులు, చంద్రశేఖర్‌రెడ్డి, వలి పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

జహీరాబాద్: ఈ నెల 4వ తేదీన జహీరాబాద్ పట్టణంలో ఉజ్వల్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కిమ్స్, గ్లోబల్ ఆస్పత్రులకు చెందిన ప్రముఖ వైద్యులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యశిబిరం ప్రారంభోత్సవానికి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. శిబిరంలో జనరల్, గుండె, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, కంటి సంబంధిత వైద్య నిపుణులు రోగులను పరీక్షిస్తారన్నారు.

7న క్రికెట్ టోర్నీ ప్రారంభం

నారాయణఖేడ్: సంత్ సేవాలాల్ 285వ జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రమేష్‌చౌహాన్, బాధ్యులు లక్ష్మణ్‌చౌహాన్, రవీందర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్నీస్‌బాల్‌తో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 6న సాయంత్రం 6.30గంటలకు పోటీలకు సంబంధించి డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు. టోర్నీలో పాల్గొనే జట్లు 9848986050, 6302274966, 9705825227 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



దగ్ధమైన గడ్డి, మొక్కలు

ఆకతాయిల అత్యుత్సాహం

సంగారెడ్డి చుట్టుపక్కల పరిధిలోని ఆయా గ్రామాల వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో కొంతమంది బీడీ చుట్టలు, సిగరేట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పడేసి వెళ్తున్నారు. దీంతో పొలాలకు వెళ్లే దారి పొడవునా ఉన్న మొక్కలు, మేతగడ్డి కాలిపోతోంది. ఆకతాయిలు ఇదేవిధంగా బీడీ చుట్టలు, సిగరెట్లు ఆర్పకుండా పడేసి వెళ్తే పొలాల్లోని బోరుమోటార్లు కాలిపోయే ప్రమాదం ఉందని, ఒక్కోసారి చిన్నచిన్న జంతువులు కూడా అగ్నికి ఆహుతయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ఆదమరిస్తే అంతే..

ముంబాయి–హైదరాబాద్ రహదారి పేరుకే జాతీయ రహదారి. కానీ గ్రామీణ రహదారి కన్నా అధ్వాన్నంగా మారింది. రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పక్కన కాలువలు, రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనాదారులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత



ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పాతపంటల జాతరకు స్వాగతం

కొన్నిరోజులుగా ఆయా మండలాల్లో కొనసాగిన పాత పంటల జాతర న్యాల్‌కల్ మండలంలోకి ప్రవేశించింది. దీంతో రేజింతల్ గ్రామస్తులు పాత పంటల జాతరకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల ఎడ్లబండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. జాతర కో–ఆర్డినేటర్ వినయ్‌కుమార్ చిరుధాన్యాల్లో లభించే పోషకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డీడీఎస్ మహిళలు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

– న్యాల్‌కల్(జహీరాబాద్)

పాతచెరువు శిఖం భూమి కబ్జా

- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- బరితెగిస్తున్న అక్రమార్కులు
- యథేచ్ఛగా చెరువు పూడ్చివేత పనులు
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్



పాతచెరువు శిఖం భూమిలో మట్టిని పోసిన దృశ్యం

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని షేర్ఖాన్‌పల్లి శివారులోని పాతచెరువును కొందరు అక్రమార్కులు కబ్జా చేసి రాత్రివేళల్లో మట్టితో నింపేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు పలుమార్లు చెరువును సందర్శించి హెచ్చరించినా అక్రమార్కులు పట్టించుకోవడంలేదు. అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా చెరువు పూడ్చివేత పనులను కొనసాగిస్తున్నారు.

షేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులో ఓ వ్యక్తి భూమిని కొనుగోలు చేసి లోతట్టు ప్రాంతాన్ని పూడ్చుతున్నట్లు చెపుతూనే మోరోవైపు చెరువుశిఖం భూమిలో కొంతమేర మట్టితో పూడ్చివేస్తున్నట్లు స్థానిక రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా రాత్రివేళల్లో ఇతర ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని భారీ టిప్పర్లల్లో తీసుకువస్తూ చెరువు శిఖం భూమిని పూడ్చివేస్తున్నారు. చెరువు శిఖం పూడ్చివేస్తున్నట్లు తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారి పలుమార్లు సంఘటనా స్థలానికి చేరుకొని హెచ్చరించినా అక్రమార్కులు అధికారుల ఆదేశాలను పెడచిన పెడుతూ పూడ్చివేత పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు పూడ్చివేత పనులను అడ్డుకొని అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈఈ భూపుత్రను వివరణ కోరగా ఇప్పటికే చెరువు శిఖం భూమిని పరిశీలించామని, అక్కడ కొంతమేరకు మట్టిని శిఖం భూమిలో పూడ్చినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమణకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబట్టే విధంగా బడ్జెట్ ఉందని నిరసిస్తూ రైతు సంఘం, సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్ మాట్లాడుతూ ఆర్థికమంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో చెప్పిన విషయాలు కేటాయింపులో లేవన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రైతులపై ప్రేమలేదన్న విషయం బడ్జెట్ కేటాయింపులో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపత్యం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. గతంలో తీసుకొచ్చిన నల్ల చట్టాలను మరోరకంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, నాయకులు నరేష్, సంగన్న, నర్సింహులు, మల్లారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అయోధ్య ప్రసాదం పంపిణీ

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో అయోధ్య శ్రీరామ మందిర ప్రసాదం పంపిణీ చేశారు. శనివారం పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ డాక్టర్ సిద్దేశ్వర స్వామిలతో కలిసి ప్రసాదం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని సూచించారు. ట్రస్ట్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, నాయకులు విశ్వనాథ్ యాదవ్, సతీష్ శివశక్తి గుప్తా, శ్రీనివాస్, రాములు, శివకుమార్, ఓంకార్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ఎంఈఓ దండు అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. పట్టణంలోని సత్యసాయి ఉన్నత పాఠశాలలో బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నిరుపయోగంగా ఉన్న వస్తువులతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ అంజయ్య మాట్లాడుతూ గృహోపకరణాలను విసిరివేయకుండా సృజనాత్మకత, అలంకారమైన గృహాలంకరణ వస్తువులను తయారు చేయడం భినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు వైష్ణవి, మధు, స్వాతి, పూజకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి జయమ్మ, ఉపాధ్యాయులు సాయికుమార్, మహాలక్ష్మి, శ్రీదేవి, సంధ్యారాణి, స్వాతి, ఉజ్మా, షైముదా, ఫరీజా పాల్గొన్నారు.



విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎంఈఓ అంజయ్య

భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నందికంది గ్రామంలో గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, మల్లేశం, రవి, జనార్ధన్, సంజీవులు, వీరేశం, పాండు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం



భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడుతున్న పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేష్

ప్రభుత్వ భూముల పరిశీలన

నారాయణఖేడ్: నిజాంపేట్–నారాయణఖేడ్–బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఖేడ్ మండలం జూకల్, నిజాంపేట్ మండల మునిగేపల్లి, నిజాంపేట్ గ్రామాల శివార్లలో కొల్పోనున్న భూములను ఆర్డీఓ వెంకటేష్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఖేడ్, నిజాంపేట్ తహసీల్దార్లు దేవిదాస్, రాజగణేష్, నాయబ్ తహసీల్దార్లు అబ్దుల్ మోగిని, శివకృష్ణ, మండల సర్వేయర్లు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు

కోహీర్(జహీరాబాద్): విద్యార్థులకు బాల్యం నుంచే మంచి అహారపు అలవాట్లను అలవర్చుకునేవిధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుసేన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ మహమ్మారి నుంచి తమను తాము కాపాడుకోవచ్చునని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు సురేష్, భార్గవి కాన్సర్ వ్యాధి కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిందర్, శ్రీనివాస్, గుణవతి, డాక్టర్ వసంత్‌రాజ్, సురేష్, విజయలక్ష్మి, చంద్రశేఖర్, అహమ్మద్ హసిబుద్దీన్ వికార్ పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- సర్పంచ్‌ల కృషి అభినందనీయం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రస్తుత, మాజీ సర్పంచులు, ఉపసర్పంచ్‌లను శనివారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు అందించిన సేవలు అభినందనీయమన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఐదేళ్ల పాటు గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల కాలంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా జనాభా సంఖ్యకు అనుగుణంగా ప్రతినెల నిధులు విడుదల చేస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. జాతీయ స్థాయి అవార్డులు సైతం తెలంగాణ పల్లెలు అందుకున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు దేవానందం, సుష్మాశ్రీ, ప్రవీణ, జెడ్పీటీసీలు సుప్రజ, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మొగుడంపల్లి మండలంలో...

జహీరాబాద్ టౌన్: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మొగుడంపల్లి మండలంలోని ధనసరి గ్రామ సర్పంచ్ హబ్సిరాజుతో పాటు ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామ పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంకాల్ సుభాష్, షేక్ ఫరీద్, మచ్చెందర్, నారాయణ, రాంశెట్టి, కుతుబోద్దీన్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్: సర్పంచ్ హబ్సిరాజును సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ అందుబాటులో యూరియా

రాయికోడ్(అందోల్): యాసంగి సీజన్‌లో భాగంగా సాగు చేసే పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలతో పాటు ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో 60 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలిన సూచించారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

వట్‌పల్లి(అందోల్): కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 2024 నూతన క్యాలెండర్‌ను వట్‌పల్లి పోలీస్టేషన్‌లో ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాసు, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్రొళ్ల శివయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహులు, గంగరాం పాల్గొన్నారు.

◆ వాహనాల తనిఖీ

జహీరాబాద్: పట్టణంలోని 108 వాహనాలతో పాటు 102 వాహనాలను ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఎంటీ, కెప్టెన్‌లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఈఎంఈ హుసేన్, మహేష్, వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

◆ ప్రజలతో మమేకం కావాలి

జహీరాబాద్ టౌన్: బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకం కావాలని గావ్ చలో అభియాన్ ఇన్‌చార్జి కిష్టన్న అన్నారు. పట్టణంలో శనివారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టన్న మాట్లాడుతూ ఈ నెల 11 వరకు పల్లెకు పోదాం పదండి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు జగన్నాథ్, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, సంగారెడ్డి, నాగరాజ్, అంజి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ సమస్యలు ఉంటే సమాచారమివ్వండి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో సమస్యలుంటే పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జేపీ కాలనీలో డ్రైనేజీ లైన్, మురుగు నీరు కాలువను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

◆ కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జిన్నారం(పటాన్‌చెరు): కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగరావు అన్నారు. జిన్నారంలో ఆ పార్టీ కార్యకర్తలు శనివారం పల్లెకు పోదాం పదండి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజిరెడ్డి, రమేష్, మధుసూదన్‌రెడ్డి, శంకర్, రాజు, జగన్‌రెడ్డి, కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మగ్దుంపూర్ ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్ అన్నారు. మగ్దుంపూర్‌లోని జోసఫ్ పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజీవ్ వర్గీస్ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించండి

నర్సాపూర్: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని 10, 11 వార్డుల్లో కొనసాగుతున్న మురికి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, ఆంజనేయులుగౌడ్, నగేశ్ తదితరులు ఉన్నారు.